ఈనాడు
తూర్పుగోదావరి
గురువారం 27 జూన్ 2019 16 పేజీలు




# విద్యార్థుల భవితకు అనుగుణంగా కోర్సులు

- ర్యాగింగ్ నిరోధానికి చర్యలు
- 'న్యూస్‌టుడే'తో జేఎన్టీయూకే ప్రిన్సిపల్ పి.సుబ్బారావు

ముఖాముఖి

న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్ (కాకినాడ)

త్వరలో ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి జేఎన్టీయూకేలో పలు సంస్కరణలు తీసుకొస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.సుబ్బారావు తెలిపారు. విద్యార్థుల భవితకు అనుగుణమైన కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నామని, ప్రధానంగా కళాశాలలో ర్యాగింగ్ నిరోధానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కళాశాలకు సంబంధించి పలు అంశాలను ఆయన 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

## కొత్త పుంతలు తొక్కనున్న మార్పులు..

జేఎన్టీయూకే కళాశాల్లో ఏడు బీటెక్, 17 ఎంటెక్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ కోర్సు ఈ ఏడాది కెమికల్ ఇంజినీరింగ్‌గా రూపాంతరం చెందనుంది. ఈ కెమికల్ ఇంజినీరింగ్‌తో పాటు పెట్రోలియం ఇంజినీరింగ్ కోర్సుకు ఆలిండియా కౌన్సిల్ టెక్నాలజీ ఇంజినీరింగ్ బోర్డు నుంచి గుర్తింపు పొందాం. ఎంటెక్ కోర్సుల్లో సైబర్ సెక్యూరిటీ, పవర్ ఎలక్ట్రానిక్ అండ్ డ్రైవ్స్ కోర్సులు ఏఐసీటీఈ గుర్తింపు పొందాయి. ఈ ఏడాది బీటెక్‌లో కొత్తగా ఫుడ్ అండ్ సేఫ్టీ ఇంజినీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

## వర్సిటీ కళాశాల్లో చదవడం విద్యార్థుల కల

జేఎన్టీయూకే కళాశాలలో ఇంజినీరింగ్ విద్యనభ్యసించాలని విద్యార్థులు కలలు కంటారు. తొలి విడత ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలోనే జేఎన్టీయూకే కళాశాలలో పూర్తిస్థాయిలో అన్ని బ్రాంచీల్లో సీట్లు భర్తీ అవుతున్నాయి. కాకుంటే... జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీలకు వెళ్లిపోతున్నారు. ఇటువంటి సీట్లను ప్రైవేట్ కళాశాల్లో మేనేజ్‌మెంట్ స్పాట్ అడ్మిషన్ల కింద భర్తీ చేస్తారు. వర్సిటీ అటానమస్ కళాశాల కావడంతో భర్తీ అయిన సీట్లు నాలుగేళ్లపాటు ఖాళీగా ఉంటాయి.

## విద్యా విధానంలో మార్పులు...

ఈ ఏడాది ఇంజినీరింగ్ విద్యకు సంబంధించిన బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో నూతన సిలబస్ అందుబాటులోకి రానుంది. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి ఏఐసీటీఈ బోర్డు నూతన పాఠ్యాంశాలతో ప్రణాళికను సిద్ధం చేసింది. దీంతోపాటు ఉన్నత విద్యామండలి మరో నూతన పాఠ్యాంశాల ప్రణాళికను సిద్ధం చేసింది. వీటిపై చర్చించి 'ఆర్19' పేరిట నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టానున్నాం. కళాశాల పునః ప్రారంభం నాటికి పాఠ్యాంశాలను సిద్ధం చేయనున్నాం.

## వసతిగృహాలు అందుబాటులోకి...

రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యనభ్యసించడానికి జేఎన్టీయూకేకు వస్తారు. వర్సిటీ నిబంధనల ప్రకారం కళాశాల్లో సీటు సంపాదించిన విద్యార్థికి వసతి సదుపాయం అందించాలి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించలేకున్నా.... మొదటి ప్రాధ్యానంగా బీటెక్ విద్యార్థులకు, అనంతరం ఎంటెక్ విద్యార్థులకు అవకాశమిస్తున్నాం. మరికొందరు విద్యార్థులు అద్దె గదులు తీసుకుని చదువుకుంటున్నారు. జేఎన్టీయూకేలో 1,600 మంది అమ్మాయిలు నివసించే విధంగా నాగవళి ఒకటి, రెండు, నివేదిక వసతి గృహాలున్నాయి. 1,000 మంది అబ్బాయిలు ఉండేందుకు వీలుగా నలంద, నాగార్జున, నరేంద్ర, నటరాజ్ వసతిగృహాలు అందుబాటు ఉన్నాయి.


జేఎన్టీయూకే ప్రిన్సిపల్ పి.సుబ్బారావు

## రూ.20 కోట్లతో అభివృద్ధి

కేంద్ర ప్రభుత్వం రూసా నిధుల నుంచి కళాశాలకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.10 కోట్లతో పీజీ విద్యార్థులకు వసతిగృహాన్ని అధునాతనంగా నిర్మించాం. ఇది అందుబాటులోకి వస్తే పూర్తి స్థాయిలో విద్యార్థులకు వసతి సదుపాయం సమకూరుతుంది. మరో రూ.6 కోట్ల నిధులను భవన మరమ్మతులకు కేటాయించాం. మరో రూ.4 కోట్లు ఇంజినీరింగ్ పరికరాలు, మిషన్లు, ఫర్నిచర్ కొనుగోలుకు కేటాయించాం.

## నియంత్రణకు కమిటీలు

వర్సిటీలో చాలా వరకు ర్యాగింగ్ తగ్గింది. ఈ ఏడాది కళాశాల్లో బ్రాంచీల వారీగా ర్యాగింగ్ నియంత్రణ కమిటీలను నియమిస్తాం. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడానికి చర్యలు తీసుకుంటాం. కళాశాల హాస్టల్‌లో కమిటీలు వేసి వారంలో ఒకసారి నివేదిక ఇవ్వాలని సూచిస్తాం. అప్పటికీ ఇంకా ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తెలిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం.